జస్ట్ ఆస్కింగ్.!

ఎందుకు డంపింగ్.?

• ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాల పారబోత • స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించినా ఫలితం శూన్యం



షాపూర్‌నగర్ - జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎస్‌పీటీపీ పాయింట్


షాపూర్‌నగర్- జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డులో వేస్తున్న డెబ్రిస్

రంగారెడ్డినగర్: భవన నిర్మాణ వ్యర్థాల సేకరణ, అక్రమ డంపింగ్‌లను నిరోధించడంలో అధికారుల చిత్తశుద్ధి కొరవడింది. దీంతో గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని ఖాళీ ప్రదేశాలను డ్రెబిస్ మాఫియా నిర్మాణ వ్యర్థాలతో ముంచెత్తుతోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ వ్యర్థాలను సేకరించేందుకు అధికారులు సెకండరీ కలెక్షన్ అండ్ ట్రాన్స్‌ఫర్ పాయింట్ (ఎస్‌సీటీపీ) లను ఏర్పాటు చేసినా సరైన ప్రచారం కొరవడింది.

◆ ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను సేకరించేందుకు ఈ పాయింట్లలో టన్నుకు రూ.419 వసూలు చేసి డెబ్రిస్‌ను సేకరిస్తారు. అయితే ఇది ఖర్చుతో కూడుకున్నది కావడంతో కొందరు భవన నిర్మాణ యజమానులు డంపింగ్ మాఫియాను ఆశ్రయిస్తున్నారు. వారికి ట్రాక్టర్‌కు కొంత డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రతినిత్యం ప్రధాన రోడ్లు, ఖాళీ ప్రదేశాలు డెబ్రిస్‌లలో వందలాది టన్నుల డెబ్రిస్‌ను యథేచ్ఛగా డంప్ చేయడం గమనార్హం.


వెంకట్రామిరెడ్డి నగర్‌లో రోడ్డు పక్కనే డెబ్రిస్ డంపింగ్

సేకరణ పాయింట్ల వద్ద కానరాని సిబ్బంది..

◆ షాపూర్‌నగర్ - జగద్గిరిగుట్టకు వెళ్లే హెచ్‌ఎంటీ పైపులైన్ రోడ్డులో గాజులరామారం సర్కిల్‌కు సంబంధించి ఎస్‌పీటీపీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. అయితే అక్కడ సిబ్బంది లేకపోవడంతో సమీపంలోనే డెబ్రిస్‌ను డంప్ చేస్తున్నారు. దీంతో పేరుకే ఎస్‌పీటీపీ పాయింట్లను ఏర్పాటు చేసి వాటిని నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డెబ్రిస్ డంప్ చేస్తున్న ప్రదేశాలివే..

◆ జంట సర్కిళ్ల పరిధిలో వందలాది ఎకరాల హెచ్‌ఎంటీ ఖాళీ ప్రదేశాలు ఉండటంతో ఇదే డెబ్రిస్ మాఫియాకు వరంగా మారుతోంది. ఈ ప్రాంతానికి ఆనుకుని ఉన్న వెంకట్రామిరెడ్డినగర్, సంజయ్ గాంధీనగర్, హెచ్‌ఎంటీ కాలనీ, జగద్గిరిగుట్ట-షాపూర్‌నగర్ పైపులైన్ రోడ్డు, అదే విధంగా ఐడీపీఎల్ ఖాళీ ప్రదేశాలున్న పంచశీలకాలనీ, గురుమూర్తినగర్, గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని కూకట్‌పల్లికి వెళ్లే మార్గాలు డెబ్రిస్ డంపింగ్‌కు అడ్డాలుగా మారాయి.

స్పెషల్ డ్రైవ్ నిర్వహించినా అంతే..

◆ రోడ్లు, ఖాళీ ప్రదేశాలలో డెబ్రిస్‌ను తలరించేందుకు గత నెల 19 నుంచి 26వ తేదీ వరకు కూకట్‌పల్లిజోనల్ పరిధిలో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ సమీపంలోనే కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో కల్వర్ట్‌ను ఆనుకుని వ్యర్థాలను డంప్ చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.


ఎస్‌పీటీపీ వద్ద కానరాని సిబ్బంది

చేతివాటం ప్రదర్శిస్తున్న కిందిస్థాయి సిబ్బంది

◆ ప్రతినిత్యం గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో డంప్ చేస్తున్న డెబ్రిస్‌ను కట్టడి చేసేందుకు నియమించిన కిందిస్థాయి సిబ్బంది నామమాత్రంగా పని చేస్తున్నారు. ఎవరైనా ట్రాక్టర్‌లో వ్యర్థాలను డంప్ చేస్తున్నా వారిచ్చే మామూళ్లను తీసుకుని వదిలి పెడుతున్నట్లు విమర్శలున్నాయి. దీంతో అధికారులు డెబ్రిస్ డంపింగ్‌ను కట్టిడి చేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి నీరుగారుతున్నాయని పలువురు బహిరంగంగా చెబుతున్నారు. డెబ్రిస్‌ను డంప్ చేసే వారిపై భారీ మొత్తంలో చలాన్‌లు విధిస్తే కొంత మేర అరికట్టవచ్చని పేర్కొంటున్నారు.


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో నాలా కల్వర్ట్ వద్ద ఇలా..


సంజయ్‌గాంధీనగర్‌ను ఆనుకుని హెచ్‌ఎంటీ స్థలంలో భవన వ్యర్థాలు

స్టడీ సర్కిల్, లైబ్రరీ ప్రాంతం సరిపోవడం లేదు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసిన నేపథ్యంలో పరీక్షలకు సన్నద్ధం అయ్యే విద్యార్థులకు ఖాళీ ప్రదేశంలో వసతులు కల్పించాలని కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ నాయకుడు జెమ్మి దేవేందర్ అన్నారు. సోమవారం కొంపల్లి మున్సిపల్ అధికారులకు ఈ మేరకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని బీ.ఆర్ అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ స్టడీ సర్కిల్, లైబ్రరీ ప్రాంతం విద్యార్థులకు సరిపోవడం లేదని, అపర్ణ ఫామ్‌గ్రోవ్‌లోని ఓపెన్ ప్రదేశంలో విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు దేవేందర్ పేర్కొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

చింతల్: ప్రజావాణిలో వినియోగదారుల నీటి సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ అశోక్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. జగద్గిరిగుట్ట సెక్షన్ పరిధిలోని జగద్గిరినగర్‌లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని, గాజులరామారం సెక్షన్ పరిధిలోని షిరిడి హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున నూతనంగా భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ వేయాలని, జీడిమెట్ల సెక్షన్ నుంచి ఉడ్స్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి నూతన సీవరేజీ పైపులైన్, సూరారం సెక్షన్ నుంచి ట్రిబుల్ టైమ్ బిల్లింగ్ నుంచి వన్ టైమ్ బిల్లింగ్ చేయాలని మరో ఫిర్యాదు అందినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో డీజీఎంలు, సెక్షన్ మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

జంట సర్కిళ్ల కార్యాలయాల్లో..

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల ఉపకమిషనర్లు మల్లారెడ్డి, నరసింహల ఆధ్వర్యంలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ (02), ఇంజినీరింగ్(06), యూజీడీ (01), ఎలక్ట్రికల్ (01). అదే విధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ (02), ఇంజినీరింగ్ (05), ట్యాక్స్ సెక్షన్(01), ఎలక్ట్రికల్ (01) ఫిర్యాదులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా ప్రజా విజయోత్సవ ర్యాలీ


కొంపల్లిలో ప్రధాన రోడ్డు వెంబడి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం కొంపల్లి మున్సిపల్ రోడ్ల వెంబడి ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. పలు కూడళ్లల్లో పేరుకుపోయిన మట్టి వ్యర్థాలను జేసీబీతో తరలించారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది ఈ విజయోత్సవ ర్యాలీలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి హెల్త్ కార్డులు, సేఫ్టీ పరికరాలు, పీపీఈ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కౌన్సిలర్లు, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎనర్జీ టు సినర్జీ న్యూ డైరెక్షన్స్'పై శిక్షణ


ప్రధానోపాధ్యాయుల కాన్ఫరెన్స్‌లో అవగాహన కల్పిస్తున్న ట్రస్మా నాయకులు

సుభాష్‌నగర్: తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రధానోపాధ్యాయుల కాన్ఫరెన్స్ జరిగింది. సూరారంలోని వీఐపీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ కాన్ఫరెన్స్‌లో ఎనర్జీ టు సినర్జీ న్యూ డైరెక్షన్స్-2025 అనే అంశంపై పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు పాటు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యు డైస్ ప్లస్‌తో పాటు ఇతరత్రా ఆన్‌లైన్, ఎస్ఈపీ సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఎప్పటికప్పుడు అప్డేట్స్‌ను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. స్టేట్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ, మేడ్చల్ జిల్లా అకడమిక్ మనిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఏహెచ్‌పీఎస్ రీజినల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, విజిబిలిటీ ఆఫ్ లర్నింగ్ మెంటర్ అండ్ ట్రైనర్ రఘురామ్ వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర నాయకులు రాంచంద్రర్, చింతల మల్లేష్, హన్మంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి సోమశేఖర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మూడో మహాసభలు జయప్రదం చేయాలి

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లా సీపీఎం మూడో మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. షాపూర్ నగర్ రైతు బజారు నుంచి ఉషోదయ టవర్స్ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో మండల కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ.. అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వ పరంగా అన్ని సదుపాయాలు కల్పించేలా సీపీఎం ఉద్యమాలు చేపడుతూ వస్తోందన్నారు. గతంలో అన్యాక్రంతమైన మెట్‌కానిగూడలోని ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడటంతో సీపీఎం ప్రముఖ పాత్ర వహించిందన్నారు. పేదల పక్షాన పోరాడే సీపీఎం మూడో మహాసభల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ ర్యాలీలో నాయకులు పసుల అంజయ్య, రావుల స్వాతి, దేవదానం, సత్యం, జాకీర్ హుస్సేన్, శంకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించండి


జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: సూరారం చౌరస్తాలో తలెత్తుతున్న ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.ఎస్.వాసు ఆధ్వర్యంలో జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. సూరారం చౌరస్తాలో నిత్యం విద్యా సంస్థలు, పరిశ్రమలకు చెందిన బస్సులతో పాటు వివిధ పనుల నిమిత్తం ఇటుగా రాకపోకలు సాగించే వాహనాలతో రద్దీగా ఉంటోందని, ఒక్కోసారి కిలోమీటర్ మేర ట్రాఫిక్‌జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తకుండా వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ జిల్లా ఇండస్ట్రియల్ సెల్ కన్వీనర్ గిరిబాబు సుభాష్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి విజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు విగ్నేష్‌ముదిరాజ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఎన్‌ఓసీ లేకుండా ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు


దుండిగల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

దుండిగల్: ఎన్‌ఓసీ లేకుండా ప్రభుత్వ భూమిలో చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సోమవారం దుండిగల్ - గండిమైసమ్మ తహసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... భౌరంపేట్ సర్వే నం.166లో ఓ కళాశాల యాజమాన్యం 166/22 పేరుతో అక్రమ సర్వే నెంబరు సృష్టించి నిర్మాణాన్ని చేపడుతోందన్నారు. రెండు ఎకరాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణానికి హెచ్‌ఎండీఏ, మున్సిపల్ నుంచి ఎలాంటి ఎన్‌ఓసీ తీసుకోలేదని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం ఇచ్చిన లావణ్య పట్టాల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. కొందరు వ్యక్తులు అక్రమమార్గంలో వాటిని కబళించేందుకు యత్నిస్తున్నారని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. బీజేపీ నాయకులు దమ్మగారి ప్రభాకర్‌రెడ్డి, నల్ల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

రాజీవ్‌గృహకల్పకు బస్సు సర్వీసు ప్రారంభం


నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడు ముందుంటానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ రాజీవ్‌గృహకల్పలో బస్సు సౌకర్యం లేక స్థానికులు పడుతున్న ఇబ్బందిని హన్మంతరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన కూకట్‌పల్లి డిపో మేనేజర్‌తో మాట్లాడి గృహకల్పకు బస్సును మంజూరు చేయించారు. సోమవారం సదరు బస్సు సర్వీసును ప్రారంభించి ప్రయాణికులకు కలసి ప్రయాణించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించిందన్నారు. ఏ సమస్య తలెత్తినా తాను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షుడు అంజద్, నాయకులు లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, రాంచందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

మేయర్‌ను కలిసిన హిల్‌కౌంటీ నూతన కార్యవర్గం



నిజాంపేట్: సంక్షేమ సంఘాలు స్థానిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బాచుపల్లి హిల్‌కౌంటీ విల్లా ఓనర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మేయర్‌ను కలిశారు. కమిటీ సభ్యులను సత్కరించిన మేయర్ నీలారెడ్డి స్థానిక అభివృద్ధి విషయంలో తన సహాయం ఎల్లప్పుడు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ శ్రీదేవి, డైరెక్టర్లు నరసింహారెడ్డి, ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గూడు కోల్పోయిన ఆ కుటుంబానికి ఇల్లు కేటాయించండి



గూడు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని ఉపకమిషనర్ మల్లారెడ్డి దృష్టికి తీసుకొస్తున్న లక్ష్మణ్

కుత్బుల్లాపూర్: రోడ్డు విస్తరణలో గూడు కోల్పోయిన కుటుంబానికి ఇళ్లు కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్ కోరారు. సోమవారం గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో షాపూర్‌నగర్ ప్రధాన రహదారి పక్కన రంగ భుజంగ థియేటర్‌ను ఆనుకుని ఉంటున్న కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ ఆయన ఉపకమిషనర్ మల్లారెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో గుడిసెను తొలగించడంతో ప్రస్తుతం ప్లాస్టిక్ కవర్ కప్పుకుని కుటుంబం జీవిస్తోందని, బాధిత మహిళ భర్త ఐదేళ్ల క్రితం చనిపోయినా ఇంత వరకు పింఛన్ రావడం లేదన్నారు. సదరు కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుని, ఇంటిని మంజూరు చేయాలని కోరారు.

వనభోజనం.. ఐకమత్యం


వనభోజన కార్యక్రమంలో ఆటలాడుతున్న చిన్నారులు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో ఆదివారం రిటైర్డ్ జడ్జి జనార్దన్ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు జరిగాయి. యోగా మాస్టర్‌లు శ్రీలక్ష్మి, మల్లికార్జున్, నాగేష్(సన్నీ), ఈశ్వర కిరణ్ సహకారంతో జరిగిన వన భోజనాల్లో సంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సామూహిక సహపంక్తి భోజనాల అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొలను లక్ష్మారెడ్డి, ప్రేమ్, భూపాల్‌రెడ్డి, ప్రేమ్, రమేష్, కనక వర్ధిని తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి

సాక్షి, సిటీబ్యూరో: వివిధ జిల్లా శాఖలలో ఆన్‌లైన్ పెండింగ్ అప్లికేషన్ల సంఖ్య పెరిగి పోతోందని, వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 72 అర్జీలను జిల్లా లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తీసుకున్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 2 నుంచి 15 వరకు లెప్రసీ సర్వే చేయాలని ఆశా వర్కర్లను ప్రభుత్వం నిర్దేశించిన క్రమంలో ఇప్పటికే పెండింగ్ ఉన్న బకాయిలను చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించిన ఆశా వర్కర్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రఘునాథ్‌స్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శ రేవతి కళ్యాణి మాట్లాడుతూ... మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆశా వర్కర్ల లెప్రసీ సర్వే, టీబీ, పల్స్ పోలియో, ఎన్సీడీ పారితోషకాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఆశా వర్కర్లపై అధికంగా ఒత్తిడి పెంచే టార్గెట్లను తీసేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాళ్లు రాధ, యాదమ్మ, శంకరమ్మ, భాగ్యమ్మ, సరిత, శోభ, శశికళ, రాజ్యలక్ష్మి, ప్రవీణ, లలిత, కవిత, జ్యోతి, అనిత పాల్గొన్నారు.

బీఆర్‌టీయూ అధ్వర్యంలో...

లెప్రసీ సర్వే పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని బీఆర్‌టీయూ అధ్వర్యంలో సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. టీబీ, పల్స్ పోలియో, ఎన్సీడీ బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం సంబంధిత జిల్లా వైద్యశాఖ అధికారులకు బీఆర్‌టీయూ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.

నేడు జోడిమెట్ల చౌరస్తా వద్ద 'అర్బన్ డే'

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద మంగళవారం అర్బన్ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వీరారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటలకు జోడిమెట్ల చౌరస్తా నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ తీస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్వయం సహాయ బృందాల మహిళలకు రంగవల్లుల పోటీలు, పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ


దుండిగల్‌లో జరిగిన అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డీపోచంపల్లిలో సోమవారం సంతోష్‌గుప్తా స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వాములు నిర్వహించిన భజనలు, ఆలపించిన భక్తి గీతాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక సంతరించుకుంది. పూజ అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేయగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాముగౌడ్, మాజీ ఎంపీటీసీ రమా మాధవ రెడ్డి, తిరుపతిరెడ్డి, సాయియాదవ్, మహేందర్ ముదిరాజ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఐసీసీ స్థలం కబ్జా.!

• గతంలో అడ్డుకున్న అధికారులు • తిరిగి సదరు స్థలంలో నిర్మాణం


టీఐసీసీకి చెందిన స్థలంలో చేపడుతున్న నిర్మాణం

సుభాష్‌నగర్: లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు ఓ వ్యక్తి పేలుడు పదార్థాలు సైతం ఉపయోగించి అందులో ఉన్న బండ రాళ్లను తొలగించాడు. ఈ విషయమై గతంలో 'సాక్షి'రెండుసార్లు వెలుగులోకి తీసుకురాగా సంబంధిత అధికారులు అక్కడికి చేరుకొని, సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ పనులను నిలిపివేశారు. బండరాళ్ల తొలగిస్తున్న కంప్రెషర్లను సైతం సీజ్ చేశారు. కొన్ని రోజులు వరకు మౌనంగా ఉన్న సదరు వ్యక్తి ఎట్టకేలకు ఆ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలకు తెరలేపాడు.

◆ గాజులరామారం డివిజన్ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆనుకొని సర్వే నం.79లో టీఐసీసీకి చెందిన 300గజాల స్థలంలో ఉన్న బండరాళ్లను జూన్ 15 పేలుడు పదార్థం ఉపయోగించాడు. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుళ్లు సంభవించడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. దీంతో అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక తమ సిబ్బందితో అక్కడి చేరుకొగా పరారయ్యారు. తిరిగి ఆగస్టు నెలలో కంప్రెషర్‌తో బండరాళ్లను తొలగిస్తుండగా రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకొని వాటిని సీజ్ చేశారు. ఇంతలో ఏమైందో ఏమో కానీ తాజాగా సదరు వ్యక్తి ఆగమేఘాల మీద టీఐసీసీకి చెందిన స్థలంలో నిర్మాణానికి తెరలేపాడు. ఇక అధికారులు సదర వ్యక్తిపై ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

డాక్టర్ ప్రభుకుమార్‌కు ఐఎంఏ ఉత్తమ పురస్కారం

నిజాంపేట్: ప్రగతినగర్‌కు చెందిన లైఫ్ చారిటబుల్ ట్రస్ట్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉత్తమ సేవ పురస్కారం లభించింది. ఆదివారం బంజారా హిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బంజారా హిల్స్ పౌండర్ డాక్టర్ ప్రభు కుమార్ అధ్యక్షతన అవార్డుల కార్యక్రమం జరిగింది. లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలకు గాను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, చిత్తూరు ఎంపీ ప్రసాద్ రావుల చేతుల మీదుగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ కుమార్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఐ తెలంగాణ స్టేట్ బాడీ సభ్యులు, ఐఎంఐ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


ఏఎంఏ పురస్కారాన్ని అందుకుంటున్న ప్రభుకుమార్